ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 08.04.2026 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది.
2. రాష్ట్రంలో క్యాన్సర్‌ను నోటిఫయబుల్ వ్యాధిగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి కేసు తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని, తద్వారా పర్యవేక్షణ పెంచి కట్టడి చేయాలని ప్రభుత్వం పేర్కొంది.
3. రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 90 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు 8వేల 251 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.
4. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అశాస్త్రీయంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు.. ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు.

--------------------------------

**వాయిదా**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవోను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు,

ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది.

**పీటీసీ – హైదరాబాద్**

-----------------------------

**క్యాన్సర్**

రాష్ట్రంలో క్యాన్సర్‌ను నోటిఫయబుల్ వ్యాధిగా గుర్తిస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి కేసు తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని, తద్వారా పర్యవేక్షణ పెంచి కట్టడి చేయాలని పేర్కొంది. ఇప్పటివరకు నిమ్స్‌తోపాటు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులకు వచ్చిన కేసులను మాత్రమే గుర్తించేవారని, ఇక నుంచి ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదైన కేసులు సైతం ప్రభుత్వ లెక్కల్లోకి వచ్చేలా క్యాన్సర్ రిజిస్ట్రీకి వైద్యారోగ్యశాఖ శ్రీకారం చుట్టి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారు(డీఎంహెచ్‌వో)లు చొరవ తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**డెస్క్**

----------------------------

**ఉత్తమ్**

రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 148 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తోందని, అందులో 90 లక్షల టన్నులు సేకరించేందుకు 8వేల 251 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని మార్కెట్ యార్డులో నిన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 16 కోట్లకు పైగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామని, సన్నరకాలకు మద్దతు ధరతోపాటు 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై పూర్తి నిఘా పెట్టామని, మంత్రి చెప్పారు.

డెస్క్

--------------------------------

**తుమ్మల**

ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, నేల స్వభావానికి అనుగుణంగా శాస్త్రీయంగా ఎరువులు వినియోగించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయశాఖ నిర్వహించిన 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సచివాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉండడం ఆమోదయోగ్యం కాదని, భూసార పరీక్షల నిర్వహణ, పంటలకు అనుగుణంగా ఎరువుల వినియోగం వంటి అంశాలపై తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని రైతు విజ్ఞాన కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధన కేంద్రాల్లో రోజుకు వెయ్యి మందికి శిక్షణ ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

డెస్క్

--------------------------------

**హరీష్ రావు**

కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అశాస్త్రీయంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈమేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భారీ మోటార్లను నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినప్పటికీ, వాటిని పదే పదే ఆన్, ఆఫ్ చేయడం వల్ల వైబ్రేషన్లు వచ్చి పంపులు, ఇంపెల్లర్స్, మోటార్లు దెబ్బతింటాయని హరీశ్ రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను పాడుచేసి, ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టాలని కుట్ర జరుగుతుందని హరీష్ రావు అనుమానం వ్యక్తం చేశారు.

డెస్క్

---------------------------

**బీజేపీ**

మేయర్ పదవిని ఎంఐఎం నేత అసదుద్దీన్‌కు బహుమతిగా ఇవ్వడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీని మూడు ముక్కలుగా విభజించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. నిన్నరాత్రి హైదరాబాద్ అత్తాపూర్ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. .. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మజ్లిస్‌ను అడ్డుకొనే సత్తా బీజేపీకి మాత్రమే ఉందన్నారు. ఒకప్పుడు ఒకటి రెండు సీట్లకు పరిమితమైన కమలం పార్టీ ప్రస్తుతం 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. భవిష్యత్తులో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**డెస్క్**

------------------------------

**పాలమూరు రంగారెడ్డి**

రాబోయే మూడు సంవత్సరాలలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.. మహబూబ్ నగర్ లో నిన్న రాత్రి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

**Byte: మహేష్ కుమార్ గౌడ్**

**పీటీసీ - మహబూబ్ నగర్**

----------------------------

**జ్ఞాన భారతం మిషన్**

దేశంలోని అమూల్యమైన పాండిత్య వారసత్వాన్ని పరిరక్షించడం, డిజిటైజ్ చేయడమే భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రారంభించిన "జ్ఞాన భారతం మిషన్" లక్ష్యమని

తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ క్లస్టర్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జరీనా పర్వీన్ తెలిపారు. పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన అరుదైన చేతిరాత గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు కలిగి ఉన్న వ్యక్తులు, కుటుంబాలు, సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. నిపుణులు వాళ్ల ఇంటికే వచ్చి, ఉచితంగా సంరక్షణ, డిజిటైజేషన్ పూర్తిచేస్తారని, ఆయా గ్రంథాలు యజమానుల వద్దే భద్రంగా ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలకు తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రఖీబ్ ను 90523 61775 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి మాన్యుస్క్రిప్టులను డిజిటైజ్ చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జరీనా పర్వీన్ కోరారు.

**జీఎస్**

---------------------------------

**మధుసూదనాచారి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు.

**పీటీసీ – సిరిసిల్ల**

------------------------------------

**యునెస్కో**

హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయానికి యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తామని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కేంద్రం వేయి స్తంభాల దేవాలయానికి 14 కోట్ల రూపాయల పైచిలుకు నిధులు విడుదల చేసిన నేపథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే ఆలయానికి వచ్చి పనుల వివరాలను.. పురావస్తు శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పీటీసీ - వరంగల్

-----------------------------